ఓడలో తుఫాన్!

సంపత్

రెండు రోజులనుంచి కమ్ముకున్న మేఘాలు తగ్గి, తుఫాను వొచ్చే వాతావరణం తగ్గిపోవటంతో తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు 'స్టేట్ ఆఫ్ హర్యానా' మీది పాసింజర్స్.

నాలుగయిదు రోజులుగా డెక్ మీదికి పోవటానికి అనుమతి లేకపోవటంవల్ల కాబిన్స్‌లోను, డైనింగ్ హాలులోను నలిగిపోయిన వాళ్ళు, హాయిగా గాలి పీల్చుకునేందుకు డెక్ పైకి వచ్చారు.

బయట వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఆకాశంలో మేఘాలేమీ లేవు. స్వచ్ఛంగా ఉంది నీలాకాశం. ఎర్రటి ఎండపడి సముద్రపునీరు కాంతులీనుతోంది.

ఆ షిప్ కెప్టెన్ కోస్లా కూడా పాసింజర్స్‌తోపాటు

డెక్ పైకి వచ్చి వారి ఆనందంలో పాలు పంచుకొంటు న్నాడు.

హఠాత్తుగా వారి ఆనందానికి అంతరాయం కల్గింది.

ఎవరో భయపడి పెద్దగా అరిచారు. క్షణాల్లో చిన్న గుంపు తయారయిం దక్కడ. కెప్టెన్ ఖోస్లా కూడా 'ఏం జరిగిందంటూ అటువైపు నడిచాడు.

గుంపుగానున్న జనం తొలిగి దారి యిచ్చారతనికి. మధ్యలోనున్న దృశ్యం చూసి దిగ్భ్రాంతుడయ్యాడు కెప్టెన్ ఖోస్లా.

గుండెల కరకు దిగిన కత్తిపిడి పైన రక్తంతో తడిసి తెల్లటి యూనిఫాం ఎర్రగా అయిపోయింది. పళ్ళు బిగ పట్టినట్లున్నాయి. చివరి క్షణాలలో బాగా కొట్టుకొని ఉండాలి. ఒక చేయి కత్తిపిడిమీద ఉంది.

నౌకా సిబ్బందిలో స్వీపర్ అతను. దారుణంగా హత్య చేయబడ్డాడు. అక్కడా శవాన్ని చూసిన పాసింజర్స్ అంతా భయపడిపోయారు.

కెప్టెన్ ఖోస్లాకు మతిపోయినట్లయింది. కాని అంత లోనే కర్తవ్యం స్ఫురించింది. క్షణాలలో డెక్ అంతా ఖాళీ అయింది. ఇంతకుముందున్న ఉత్సాహం, హుషారు మాయం అయిపోయాయి.

కెప్టెన్ ఖోస్లా కబురు అందుకొని, షిప్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాజ్ బెహెల్ వచ్చాడు.

తన సిబ్బందిలో ఒకడు అలా దారుణంగా హత్య చేయబడటం ఖోస్లాకి దుఃఖాన్నే గాదు, ఆశ్చర్యాన్నీ కలుగచేసింది. ఇతన్ని చంపాల్సిన అవసరం ఎవరికి కల్గింది? ఎందుకు చంపారు?

కొంతమంది పాసింజర్సు మరలా డెక్ మీదకి రావటంతో, నౌకా సిబ్బందిలో ఇద్దరు వారిని మరలా రిక్వెస్ట్ చేసి లోనికి పంపవలసి వచ్చింది.

డాక్టర్ బెహెల్ ప్రాథమిక పరీక్ష ముగించి, లేచి నిలబడ్డాడు.

"ఇతను మరణించి రెండు గంటల పైగా అయింది. అంటే పదిన్నర, పదకొండు గంటల మధ్య."

కెప్టెన్ ఖోస్లా టైం చూసుకున్నాడు. ఒంటిగంట కావొస్తుంది మధ్యాహ్నం.

కెప్టెన్ కోస్లా వంగి శవాన్ని పరీక్షించాడు. అతనికి ఒక విషయం వెంటనే అర్థం అయింది. స్వీపర్ని యిక్కడే డెక్ మీద చంపలేదు. ఎక్కడో చంపి, యిక్కడకు తెచ్చి ఒదిలారు.

యిక్కడే చంపివుంటే రక్త చారికలు డెక్ మీద పడేవి. కాని అవి లేవు.

ఆ శవానికి కాపలాగా యిద్దరిని ఉంచి, తన సిబ్బందికి చకచక ఆర్డర్లు జారీచేశాడు ఖోస్లా. తాను రేడియో రూంలోకి పరుగెట్టాడు. వెంటనే వైర్‌లెస్ ద్వారా ఈ విషయంపై అధికారులకు మెస్సేజ్ పంపాడు.

ఈలోగా అతని సిబ్బంది అందరూ షిప్ మొత్తం గాలించారు. అయినా స్వీపర్ని హత్య చేసిన ప్రదేశం తెలియలేదు. శుభ్రంగా కడిగి ఉంటారు అనుకున్నాడు ఖోస్లా.

తరవాత కెప్టెన్ కోస్లా ఆజ్ఞపై స్వీపర్ శవాన్ని స్టోర్ రూంలో భద్రపరిచారు.

2

"స్టేట్ ఆఫ్ హర్యానా" పైన మొత్తం నూటయాభై పైనే ఉన్నారు పాసింజర్స్, చిన్నా, పెద్దా అంతా

కలిపి. వాళ్ళల్లో పిల్లలను, ఆడవాళ్ళను మినహాయిస్తే మిగిలినవారు నూట ముప్పై ఎనిమిదిమంది.

కెప్టెన్ కోస్లా బుర్ర గోక్కున్నాడు. ఇందరిలో ఎవరిని అనుమానించేట్టు?

వీటిని పట్టించుకోకుండా మౌనంగా సాగిపోతోంది షిప్.

కెప్టెన్ ఖోస్లాకు అందిన మెస్సేజిలో ఇండియా గవర్నమెంటు వెంటనే యిద్దరు ప్రభుత్వ అధికారులను పంపుతున్నామని, ఈ హత్యా రహస్యాన్ని వారు ఛేదిస్తారని ఉంది.

వారి రాక కోసమే ఎదురు చూస్తున్నాడు కెప్టెన్ కోస్లా. నిర్జనమైన డెక్ మీద నిలబడి అటూఇటూ చూస్తున్నాడు.

మరి కొంత సేపటికి దూరంగా విమానం వొస్తున్న శబ్దం అయింది. కొన్ని నిముషాలలోనే అది షిప్ కు దగ్గరయింది.

కెప్టెన్ ఖోస్లా ఆర్డర్ పై షిప్ వేగం తగ్గించబడింది. ఆ విమానం షిప్ వద్దకు వచ్చి, షిప్ చుట్టూ చక్కర్లు కొట్టసాగింది. అయిదారు నిమిషాలనంతరం విమానం తలుపు తెరుచుకొని, పారాచూట్ లద్వారా యిద్దరు క్రిందికి దూకారు.

కోస్లా సిబ్బంది సహాయంతో వారు డెక్ పైకి చేరుకున్నారు. విమానం వొచ్చిన దిశలోనే వెళ్ళిపోయింది.

తాము ధరించిన పారాచూట్ లు విప్పి, కోస్లా సిబ్బందికి యిచ్చారు వారు.

కెప్టెన్ కోస్లా తనని పరిచయం చేసుకున్నాడు.

"గ్లాడ్ టు మీట్ యూ. మై నేమ్ ఈజ్ శంకర్ సింగ్" ఎర్రగా, పొడుగ్గా ఉన్న వ్యక్తి అన్నాడు.

"నా పేరు మహేందర్" రెండో వ్యక్తి తనను పరిచయం చేసుకున్నాడు. అతనూ దాదాపు శంకర్ సింగ్ అంత పొడుగున్నాడు. ఇద్దరి వయసు ముప్పై అయిదుకి మించి ఉండదు.

"రండి" అంటూ లోనికి దారితీసాడు ఖోస్లా.

అతనెంత రహస్యంగా ఉంచినప్పటికి ఆ వచ్చిన వారెవరో ప్యాసింజర్స్ ఊహించక పోలేదు. వారిలో ఆశలు చిగురించాయి.

కెప్టెన్ ఖోస్లాను అనుసరించి, అతని కాబిన్‌లోకి నడిచారు శంకర్ సింగ్, మహేందర్‌లు.

శంకర్ సింగ్ టీ తాగుతూ ఖోస్లా వైపు చూసి అన్నాడు.

"కెప్టెన్! హంతకుడు లేక హంతకులు నిస్సందేహంగా ఈ షిప్ మీదే ఉన్నారు. మనం త్వరగా గమ్యస్థానం చేరుకుంటే ఎవరిదోవన వారు పోతారు. అప్పుడు వారిని పట్టుకోవడం కష్టం. అందుచేత ఒక పనిచేయండి. కావాలని ఆలస్యం చేస్తున్నారని ఇతరులకు తెలియకుండా షిప్ వేగం తగ్గించండి. షిప్‌లోని ఇంజన్స్ పాడైపోయాయని, ఎక్కువ వేగంతో పోకూడదని పాసింజర్స్‌కి తెలియచేయండి. ఈలోపున మేమిద్దరం పరిశీలించి, అపరాధులెవరో కనుక్కుంటాము."

శంకర్ సింగ్ సూచన్ని మహేందర్ కూడా బలపరచటంతో అయిష్టంగానే ఒప్పుకున్నాడు కెప్టెన్ ఖోస్లా. అసలతనికి యిలా అర్థాంతరంగా ఆఫీషియల్స్‌ని పంపటంతో తల తీసేసినట్లుగా ఉంది. అయినా వారి సలహాలను తు.చ. తప్పకుండా పాటించమని ఇదివరకే ఆర్డర్స్ రావటంవల్ల ఒప్పుకోక తప్పలేదు ఖోస్లాకి.

"ఆల్ రైట్! మీరు చెప్పినట్లే చేస్తాను," అన్నాడు చివరికి ఖోస్లా. తరువాత ముగ్గురూ లేచి, బయటికి నడిచారు.

శంకర్ సింగ్, మహేందర్‌లు శవం కన్పించినచోట పరిశోధనలు సాగించారు. కొత్తగా ఏమీ తెలియలేదు.

ఆ రాత్రి డైనింగ్ టేబుల్స్ వద్ద అంతా సమావేశమై ఉండగా కెప్టెన్ ఖోస్లా లేచి నిలబడి ఒక్కసారి గొంతు సవరించుకున్నాడు. అతనేదో చెప్పబోతున్నాడని అర్థం అయింది అందరికి. క్షణంలో కలకలం తగ్గి సద్దుమణిగింది.

"లేడీస్ అండ్ జంటిల్మన్! ప్రస్తుతం మనం ఎటువంటి పరిస్థితులలో ఉన్నామో మీకు తెలుసు. మన షిప్ సిబ్బందిలో ఒకరు దారుణంగా హత్యచేయబడ్డారు. దానిసంగతి ఇంకా తేలకముందే మరో విషాదవార్త మీకు చెప్పాల్సి వస్తున్నది," అని ఆగి అందరివైపు ఒకమారు చూశాడు.

ప్రతి ఒక్కరు ఊపిరి బిగించి అతను చెప్పబోయే దాని కోసం ఎదురు చూస్తున్నారు.

"మీరంతా ఈ హత్యతో బాగా అప్‌సెట్ అయి వున్నారని తెలుసు. సింగపూర్ త్వరగా చేరుకోవాలని ఆత్రుత చెందుతున్నారని నేను గ్రహించగలను. కాని కొన్ని సాంకేతికమైన యిబ్బందులవలన షిప్ వేగం తగ్గించవలసి వచ్చింది. ఇంజన్‌లోని కొన్నిలోపాలు దీనికి కారణం. వాటిని బాగుచేయటానికి కొద్దిరోజులు పట్టుతుంది. అందుచేత మన ప్రయాణం మరికొన్నిరోజులు పొడిగించవలసి వస్తుంది," ఇంకా ఏదో చెప్పబోతున్నాడు ఖోస్లా.

సిబ్బందిలోని ఒకవ్యక్తి వచ్చి అతనికి అంతరాయం కల్గించాడు. చెబుతున్నది ఆపి, ఏమిటన్నట్లు చూశాడు ఖోస్లా. అతను దగ్గరకువచ్చి చెవిలో ఏదో చెప్పాడు.

"ఎక్స్‌క్యూజ్ మి. ఏదో మెస్సేజ్. ఎంజాయ్ యువర్ డిన్నర్" అని అతనివెంట నడిచాడు కెప్టెన్ ఖోస్లా.

ఇద్దరూ రేడియో రూంలోకి దారితీశారు. రూం బయటే యెదురయ్యాడు శంకర్ సింగ్.

"ఏమయ్యింది? ఎందుకు కబురు చేశారు?" ఆత్రంగా అడిగాడు కెప్టెన్ ఖోస్లా.

"రండి" అంటూ లోనికి నడిచాడు శంకర్ సింగ్. లోపలి దృశ్యం చూసి, అచేతనంగా నిలబడిపోయాడు కెప్టెన్.

వీపులో దిగిన కత్తితో, ప్రాణాలు కోల్పోయిన శరీరంతో, కుర్చీలో ముందుకు వాలిపోయివున్నాడు వైర్‌లెస్ ఆపరేటర్.

3

"మా కళ్లెదుటే యింత ఘోరం జరుగుతుందని ఊహించలేకపోయాం" బాధపడుతూ అన్నాడు శంకర్ సింగ్.

అతని మాటలతో తేరుకున్నాడు కెప్టెన్ ఖోస్లా. అయోమయంగా అతనివైపు చూశాడు. శంకర్ సింగ్ ముఖం గంభీరంగా వుంది.

కెప్టెన్ ఖోస్లా డాక్టర్‌కి కబురుజేశాడు. రెండో హత్య అని తెలియగానే అదిరిపోయాడు ఆయన. అయినా తన డ్యూటీ తను నిర్వర్తించాడు.

కెప్టెన్ కోస్లా హృదయంలో అనుమానాందోళనలు చోటు చేసుకున్నాయి. కోపం ముంచుకొచ్చింది.

"మీరు యిక్కడుండగానే మరో హత్య జరిగింది ఇంకా నా సిబ్బందిని ఎంతమందిని నాశనం చేస్తారో ఊహించలేకున్నాను. మీరు షిప్ మీద దిగి ఆరేడు గంటలు దాటాయి. ఇంతవరకు ఒక్క క్లూకూడా దొరక లేదు. అంతా అయ్యాక విచారిస్తే ఏం లాభం?" అంటూ తన మనసులోని ఆవేదనని వెళ్ళగ్రక్కాడు కోస్లా.

అదివిని కూడా మౌనంగా ఉండిపోయాడు శంకర్ సింగ్. కెప్టెన్ ఎంత బాధపడుతున్నాడో అతనికి అర్థం అయ్యింది. అదీగాక అతనన్నదీ నిజమే! తన పరిశోధన ఒక్క రవ్వకూడా ముందుకు జరగలేదు.

"ఇతను మరణించి అరగంటకంటె ఎక్కువవలేదు."

డాక్టర్ శ్రీరాజ్ బెహెల్ మాటలకు శంకర్ సింగ్ నే కాక కెప్టెన్ కూడా త్రుళ్ళిపడ్డాడు.

నమ్మలేనట్లు డాక్టర్ వైపు చూశాడా కోస్లా.

"ఇంతకు శవాన్ని ఎవరు చూశారు ముందుగా?" అన్న శంకర్ సింగ్ ప్రశ్నతో తేరుకున్నాడు కోస్లా.

"నేను సర్!" నౌకా సిబ్బందిలో ఒకరన్నారు.

"జరిగిందేమిటో త్వరగా చెప్పు!" అసహనంగా అరిచాడు కోస్లా.

"డైనింగ్ హాలులో అందరికీ డిన్నర్ సర్వ్ చేస్తున్నాను. యింతలో రేడియో రూంనుంచి ఫోన్ వచ్చింది. వెంటనే కాఫీ పంపమని, నేను తీసుకొని వెళ్ళాను. తలుపులుమూసి ఉన్నాయి. తెరచేసరికి ముందుకు వాలి, చనిపోయి ఉన్న ఆపరేటర్ కన్పించాడు. భయంతో

చిన్నగా అరిచాను. ఈ సంగతి వెంటనే అటుగా వస్తున్న శంకర్‌సింగ్ గారితో చెప్పాను. వారు కూడా చూసి మీకు కబురు చేయమన్నారు" చెప్పాడు అతను.

కెప్టెన్ కోస్లా ముందుకు కదిలి రేడియో రూంని పరీక్షించటం మొదలు పెట్టాడు. అందులో మార్పేమీ కన్పించలేదు బోయే తెచ్చిన కాఫీ ట్రే, పాట్ యింకా బల్లమీదే ఉన్నాయి.

కెప్టెన్ కోస్లా చూపులు హఠాత్తుగా ఆపరేటర్ ముందున్న మెస్సేజ్ రిసీవింగ్ బుక్‌మీద పడినాయి.

రిసీవ్ చేసుకున్న ప్రతి మెసేజ్‌నీ దానిలో రికార్డ్ చేస్తారు. ఒరిజినల్ కెప్టెన్‌కిపంపి, డూప్లికేట్‌గా కార్బన్ కాపీని ఉంచుతారు.

ఆ బుక్ తెరిచి చూశాడు కోస్లా. ఎవరో రెండు కాయితాలను అతిజాగ్రత్తగా చించినట్లు జాగ్రత్తగా గమనిస్తే తెలుస్తోంది.

దానిముందు వచ్చిన మెసేజ్ చూశాడు. మూడు గంటలక్రితం వచ్చిన మెస్సేజ్ అది, అది తనకు అందినది. అంటె దీని తర్వాత వచ్చిన మెస్సేజ్‌ని ఎవరో డూప్లికేట్‌తో సహా చించుకు పోయారన్నమాట. దానిలో ఏముంది? దానివల్ల హంతకుడికి నష్టం ఏమిటి?

శంకర్‌సింగ్ సలహాపయిన ఈ వార్తను అధికారులకు చేరవెయ్యలేదు. అతనికి మరో అవకాశం యిచ్చి చూద్దామనుకున్నాడు.

"యింతకూ మహేందర్‌గారు ఏరీ?" హఠాత్తుగా అడిగాడు కోస్లా.

"పాసింజర్స్ కాబిన్‌లు చెక్ చేయడానికి వెళ్ళాడు." ప్రత్యుత్తరము ఇచ్చాడు శంకర్.

ఆశ్చర్యపోయాడు కోస్లా. "పాసింజర్స్ రూమ్స్ ఎందుకు?"

"చూడండి కెప్టెన్! హంతకుడు మనలోనే ఉన్నాడు. మీ సిబ్బందిలో ఎవరయినా ఈ హత్యలు చేస్తున్నారని మీరు భావిస్తున్నారా?" సూటిగా అడగటంతో తబ్బిబ్బయ్యాడు కెప్టెన్ కోస్లా.

"ఆ ఆలోచన నా కింతవరకు రానేలేదు! నా సిబ్బందిలోని వ్యక్తులు అటువంటి వారు కాదు," దృఢ కంఠంతో అన్నాడు కోస్లా.

"యస్. అందుకే పాసింజర్స్‌ని చెక్ చేస్తున్నాం. పాసింజర్స్‌లోనే ఎవరో తప్పకుండా హంతకులై ఉంటారు. అంతేకాదు.

నా ఊహ ప్రకారం ఒకరికంటె ఎక్కువే ఉండవచ్చు హంతకులు. లేకపోతే యింత పకడ్బందీగా హత్యలు చెయ్యటం ఒక్కడివల్ల సాధ్యంగాదు.

అందుచేత డైనింగ్ టేబుల్స్‌వద్ద అందరినీ వీలయినంతగా ఎక్కువసేపు గడిపేలా చూడండి. ఏదో ఒక విధంగా ఆలస్యం చేస్తే మాకు మంచిది. ఈ లోపున మే మిద్దరం కాబిన్స్ చెక్ చేయటం పూర్తిచేస్తాం!"

తరవాత శంకర్‌సింగ్ వెళ్ళిపోయాడు. ముఖంమీద నవ్వు పులుముకొని డైనింగ్ హాలులోకి నడిచాడు కెప్టెన్ కోస్లా. యింకా డిన్నర్ పూర్తికాలేదు.

4

తెల్లవారింది. ఎటువంటి వార్త వినవలసి వస్తుందోనని బిగపట్టుకు కూర్చున్న కెప్టెన్ కోస్లా ఎనిమిదిగంటలవుతున్నా ఏ విధమైన కంప్లైంటూ రాకపోవడంతో కాస్త స్థిమిత పడ్డాడు.

కాలకృత్యాలు ముగించుకుని, డ్రస్ ధరించి, రేడియో రూం వద్దకు నడిచాడు. నిన్న వైర్ లెస్ ఆపరేటర్ చని పోవడంతో ఆ రూంకి తాళం వేసి ఉంచాడు.

తాళం తెరిచి లోనికి రావటంతోనే నిర్ఘాంత పోయాడు.

వైర్ లెస్ ట్రాన్స్మీటర్ సెట్ అంతా ఛిన్నా భిన్నంగా ధ్వంసం అయిపోయిఉంది. ఇక మరెవ్వరూ దానిని రిపేర్ చేయలేరు.

తలమీద పిడుగులు పడినట్లయింది కెప్టెన్ కోస్లాకు. తాళం వేసిఉన్న రూంలోకి ఎలా ప్రవేశించ గలిగారు అన్న సందేహం జనించింది. ఆయన దృష్టి వెంటిలేటర్ మీద పడింది. కాని దానిద్వారా ఒక మనిషి లోనికి రావటం అసంభవం. తాళం తన దగ్గరేఉంది. అయితే ఎలా వొచ్చారు?

చటుక్కున ఒకటి తోచిందతనికి. క్రితంరోజు రాత్రి పార్టీ అయిన తర్వాత తను కాబిన్ కు నడిచాడు. అక్కడ లిక్కర్ తాగాడు. ఎంత అపుకుందామన్నా మత్తు ఆగలేదతనికి. అంటె తను తాగిన ఆ పానీయంలోనే మత్తుమందు కలిపి ఉంటారు.

కెప్టెన్ కోస్లా పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పెద్ద గూడుపుఠాణీ ఏదో జరుగుతూంది తన షిప్ మీద. పాసింజర్స్ అంతా అనుమానాస్పదంగా కనుపించ సాగార తనికి.

"ఈ యిద్దరు సి. ఐ. డి. లు ఏమయ్యారు?" అను

కుంటూ కంట్రోలు రూంకి తిరిగి వచ్చాడు. అక్కడ అతని కోసం మరో వార్త ఎదురు చూస్తోంది.

దానిని వింటూనే అతని మెదడు పనిచేయటం మానేసి, మొద్దు బారి నట్లయింది. రెండు నిమిషాల తర్వాత తేరుకుని పాసింజర్స్ కాబిన్ వయిపు అడుగులు వేశాడు.

కెప్టెన్ కోస్లా రాకచూసి, అంతవరకు తమ కాబిన్స్ లోపలఉండి, తలలు బయటికి పెట్టి చూస్తున్న పాసింజర్సు, చటుక్కున తలలు లోనికి లాక్కుని తలుపులు వేసుకున్నారు.

బరువుగా అడుగులు వేసుకుంటూ ఒక కాబిన్ లోకి అడుగు పెట్టాడు. లోపల శంకర్ సింగ్, మహేందర్ లు, మరో యిద్దరు నౌకాసిబ్బంది ఉన్నారు.

బెడ్ మీద ఒకవ్యక్తి పడుకొని ఉన్నాడు. కాని అతని ప్రాణాలు అతని దగ్గరలేవు.

నలభై ఏళ్ళుంటాయి. బొంబాయిలో పేరు పొందిన పెద్ద వ్యాపారి అతను. గొంతు నులిమి హత్య చేశారని స్పష్టంగా తెలుస్తోంది.

నెమ్మదిగా శంకర్ సింగ్ వైపు చూశాడు కోస్లా.

"బయట వరండాలో హత్య చేయబడి ఉన్నాడు. ఉదయాన్నే పాసింజర్సు ఇతన్నిచూసి భయపడ్డారు. మీ కోసం చూస్తే మీరు లేరు. వెంటనే మేము బయట నున్న శవాన్ని లోనికి చేర్చాము. పరిశోధనల వల్ల ఇతను నిన్నరాత్రి పదకొండు గంటల వరకు బాగానే ఉన్నాడని తెలిసింది."

అతను చెప్పినదంతా మౌనంగా విన్నాడు కోస్లా. ఆ కాబిన్ అంతా పరికించాడు. ఒక మూలగా ధ్వంసం

చేయబడిన వస్తువులేవో కన్పించాయి. దగ్గరికి పోయి చూశాడు. ట్రాన్సిస్టరు రేడియో ముక్కలు అవి. ఎవరో పగలకొట్టి నాశనం చేశారు.

కెప్టెన్ కోస్లా మనస్సులో అనేక అనుమానాలు. లక్ష సందేహాలు. ట్రాన్సిస్టరుని పగల కొట్టవలసిన అవసరం ఏమిటి?

వైర్ లెస్ ట్రాన్స్మిటర్ ని పగలగొట్టటంతో బయటి ప్రపంచంతో తమకు సంబంధం తెగిపోయింది. కాని రేడియోను ఎందుకు పగల కొట్టారు?

కెప్టెన్ కోస్లా ఒక నిర్ణయానికి వచ్చాడు. అతని ముఖంలో మారుతున్న భావాలను, రంగులను గమనిస్తూనే ఉన్నాడు శంకర్ సింగ్.

"ఆల్ రైట్! యిక ఉపేక్షిస్తే లాభంలేదు. షిప్ చాలా స్లోగా పోతూంది. వెంటనే వేగం పెంచమని ఆర్డరు ఇస్తాను. సింగపూరు చేరితే అక్కడి పోలీసులే చూచుకుంటారు."

"కెప్టెన్" అన్న మహేందర్ మాటలకు, కదల బోయిన కోస్లా ఆగిపోయాడు.

"మా మీద మీకు నమ్మకం పోయినట్లుంది. సింగపూర్ చేరే లోపల హంతకులను పసిగట్టుతాం. కాని కాస్త టైం తీసుకుంటుంది."

"నో! వీల్లేదు. ఇలా రోజుకి యిన్ని హత్యలు జరుగుతుంటే చేతకాని వాళ్ళకి మల్లే చేతులు ముడుచుకొని కూర్చోలేను. వెంటనే షిప్ సింగపూర్ వీలయినంత త్వరగా చేరాలి. ఈ విషయం కూడా గవర్నమెంట్ కి తెలపాలి."

"ఎలా కెప్టెన్? వైర్‌లెస్ ట్రాన్స్‌మీటరు ముక్కలయిందిగా?" ఆ మాట అనడమేమిటి, మహేందరు నాలుక కొరుక్కోవడం, కోస్లా ధడాలున తలెత్తి అతని ముఖంలోకి చూడటం జరిగిపోయింది.

"మీకు...మీ కెలా తెలుసు?"

కోస్లా ప్రశ్నకు జవాబుగా శంకర్‌సింగ్, మహేందరు చేతుల్లో రివాల్వరులు సమాధానం యిచ్చాయి క్లిక్‌మని.

అదిరిపోయాడు కోస్లా వాటిని చూస్తూనే.

5

ఆ రోజు మధ్యాన్నం అంతా డైనింగు హాలులో ఉన్న సమయాన అక్కడికి వచ్చాడు శంకర్‌సింగ్. అతన్ని చూడగానే హాలులో ఉన్న శబ్దం సద్దు మణిగింది.

అందరూ తన వైపు దృష్టి నిలపడం గమనించి, గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు శంకర్‌సింగ్.

"లేడీస్ అండ్ జంటిల్మన్! మీ ఆనందానికి అంతరాయం కలిగిస్తున్నందుకు మన్నించండి. ప్రస్తుతం మనం ఎటువంటి పరిస్థితులలో ఉన్నామో మీకు తెలుసు. అడుగడుగునా భయానకమయిన హత్యలు సాగిస్తూ, మన మధ్యే సంచరించే హంతకులతో ప్రయాణం కొనసాగిస్తున్నాము. ఇక్కణ్ణుంచి ఎంత త్వరగా బయటపడితే అంత బాగుణ్ను అని మీరు అంతా తలపోస్తున్నారు.

కాని మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచాడు. యిప్పటికే యంత్రాలలోని లోపాలవల్ల నౌక వేగం తగ్గి కుంటి నడక సాగించ వలసి వస్తూంది. అంతేగాక ఇంజన్‌లోని అనుకోని మరో లోపంవల్ల యమ ఆపద సంభవించింది."

ఆ మాట వినగానే పాసింజర్స్‌లో కలకలం చెలరేగింది. ఆత్రంగా శంకర్ వైపు చూశారు. అతడు ప్రతి ఒక్కరినీ పట్టిపట్టి పరీక్షిస్తున్నాడు. కోలాహాలం సద్దుమణిగాక తిరిగి ప్రారంభించాడు.

“మీరు భయపడవలసిన పనిలేదు. మనం ఎక్కడో ఒకచోట తప్పకుండా ఆగవలసి వస్తున్నది. ప్రస్తుతం నౌకాసిబ్బంది అంతా ఆ యింజన్‌లోని లోపాలను సరిదిద్దటంలో మునిగిపోయి ఉన్నారు. మన కెప్టెన్ కూడా ఆ పనిమీదే ఉద్యుక్తులై ఉన్నారు. ఆయన తరపున నేను రావలసి వచ్చింది.

ప్రస్తుత పరిస్థితులలో నౌకకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో, చెప్పలేము. మీ అందరిని రక్షించే బాధ్యత మాది. మేము చెప్పినట్లు వింటే యిక్కణ్ణుంచి క్షేమంగా బయట పడవచ్చు. దయచేసి యిప్పటినుంచి మీరందరూ యిక్కడే ఉండి పోవలసినదిగా కోరుతున్నాను. సిబ్బంది మీకు కావలసిన ఆహారవ్యవహారాలు సమకూరుస్తుంది. మీ మీ కాబిన్‌లను ఖాళీచేసి అందరూ యిక్కడికే చేరుకోవలసిందిగా రిక్వెస్ట్ చేస్తున్నాను.”

ముగించి అందరి వంక చూశాడు శంకర్ సింగ్. శంకర్ సింగ్ తమతో నిజం చెప్పటం లేదేమోనన్న సందేహానికి లోను అయ్యారు కొందరు. కాని అందరి మనస్సులూ కీడుని శంకించాయి. వారి ముఖాల్లో ఆందోళన, భయం గోచరించాయి.

రెండు నిమిషాలాగి తన అనుచరులయిన సిబ్బందికి సైగ చేసి అక్కణ్ణించి కదిలాడు శంకర్ సింగ్.

మరుక్షణమే హాలులో గోల పెద్దదయింది. ఆ గోల

దూరం అవుతుండగా కంట్రోలు రూంలోకి నడిచాడు శంకర్ సింగ్.

6

కెప్టెన్ కాబిన్ లోకి నడిచాడు శంకర్ సింగ్.

అతనివంక క్రోధం నిండిన కళ్ళతో చూశాడు కెప్టెన్ కోస్లా.

కెప్టెన్, బెహెల్ యిద్దరూ బంధింపబడి ఉన్నారు. ఆ యిరువురి కాళ్ళు, చేతులు వెనక్కి ఉంచి నైలాన్ తాళ్ళతో కట్టివేయబడి ఉన్నాయి. నోటికి టేప్ అతికించబడి ఉంది.

కోస్లా అసహనంగా అటూ ఇటూ గింజుకుంటున్నాడు. వారికి ఎదురుగా కూర్చున్నాడు శంకర్ సింగ్. నవ్వుతూ వారి వయిపు చూశాడు.

"సారీ కెప్టెన్! మిమ్మల్ని బంధించటం నా కిష్టం లేదు. అయినా మిమ్మల్ని "ఫ్రీ"గా వదిలితే పిచ్చి పను లేవో చేస్తారు. మిమ్మల్ని చంపక తప్పదు. అందుకే యిష్టం లేకపోయినా బంధించాల్సి వచ్చింది.

నోటికి టేప్ ఉండటంవల్ల కెప్టెన్ కోస్లా ఏమీ అన లేక పోయాడు గాని, అతని కళ్ళల్లో కసి కొట్టొచ్చి నట్లు కన్పిస్తూనే ఉంది.

"ప్రస్తుతం ఈ షిప్ కి ఇన్ ఛార్జ్ గా ఉన్నాను. మా అవసరం తీరిపోగానే మిమ్మల్ని వదిలేస్తాము. పాసింజర్సుకి కూడా అబద్ధాలేవో చెప్పి నమ్మించాను. కెప్టెన్ వి కనుక నీకు నిజం చెప్పటం నా ధర్మం."

జేబులోనుంచి సిగరెట్ తీసి, ముట్టించుకున్నాడు శంకర్. కెప్టెన్ కోస్లాకి, డాక్టరు శ్రీరాజ్ బెహెల్ కి అతను చెప్పేదేమిటో వినాలనే కుతూహలం జనించింది.

"మొదటినుంచి జరిగింది చెబుతాను వినండి. నిజానికి మేము యిండియా ప్రభుత్వం పంపిన అధికారులము కాము. ఇండియాకు శత్రుభావంగల ఒకానొక దేశానికి సంబంధించిన వాళ్ళం. ఆ దేశమేదో మీ కనవసరం.

ప్లాస్టిక్ సర్జరీతో మా యిద్దరినీ ఇండియన్స్‌లా తయారు చేశారు. మమ్మల్నే కాదు, ఇంకా కొంత మందిని కూడా తయారుచేసి మీ దేశంలోకి వదిలారు. వారంతా రకరకాల ఉద్యోగాలు, వృత్తులలో ఉంటూ రహస్యంగా గూఢచారిత్వం నెరపుతున్నారు. అఫ్‌కోర్సు! ఈ షిప్‌లో కూడా మా వాళ్ళు అయిదుగురు మీ సిబ్బంది రూపంలో ఉన్నారనుకో!" నవ్వాడు శంకర్‌సింగ్.

కెప్టెన్ కోస్లా, డాక్టరు శ్రీరాజ్ బెహెల్‌ల ముఖాలు వెలవెలాబోయాయి. ఈ దారుణాలలో ఎంత రహస్యం యిమిడి ఉంది!

"మొట్టమొదటి హత్య ఈ షిప్‌లో, ఎందుకు జరిగింది అన్నది మాకుతప్ప యిక్కడెవరికీ తెలియదు. అసలు ఇంత గందరగోళం ఎందుకో తెలుసా? ఈ షిప్‌లో రహస్యంగా యురేనియం ఖనిజం ఎగుమతి చేయబడుతూంది."

శ్రోతలిద్దరి కళ్ళల్లో విపరీతమయిన ఆశ్చర్యం కన్పించింది. అది గమనించి నవ్వాడు సింగ్.

"అవును. ఈ నిజం మీకే కాదు, ఈ షిప్‌లోని పాసింజర్సుకి యిద్దరికి తప్ప మరెవ్వరికీ తెలియదు.

ఇండియాకు సంబంధించిన వ్యక్తులు కొందరు కలకత్తా నుంచి దొంగిలించి తెచ్చిన యురేనియం ఖనిజాన్ని పెద్ద పెద్ద బాక్స్‌లలో విశాఖపట్నం రవాణాచేసి, అక్కడ్నుంచి సింగపూరు తరలించుకు పోవటానికి ప్రయత్నం చేశారు. చాలా పకడ్బందీగా సాగించారీ వ్యవహారాన్ని.

కస్టమ్స్‌కిగాని, యితరులకుగాని ఏ విధమైన సందేహానికి ఆస్కారమివ్వకుండా బొమ్మలు రవాణా చేస్తున్న పెట్టెలతో వీటిని ఎగుమతి చేశారు. దాదాపు డెబ్భై, ఎనభై ఉన్న పెట్టెలమధ్య ఇరవై వరకు యురేనియం ఖనిజం ఉన్న పెట్టెలున్నాయి. ఆ పెట్టెలలోకూడా చుట్టూ బొమ్మలు అమర్చారు. తేలిగ్గా ఒక పట్టాన బయట పడదు ఖనిజం.

ఆగి గట్టిగా దమ్ము పీల్చుకున్నాడు శంకర్‌సింగ్.

"అయితే తలవనితలంపుగా వారి ప్రయత్నం మా ఏజెంట్ల కంటబడింది. అయితే అప్పటికే విశాఖపట్నం నుంచి ఈ షిప్ బయలు దేరింది. మేము ఈ షిప్‌లో నున్న ఏజెంటుతో మాట్లాడాము వైర్‌లెస్‌లో. అతనూ బాక్సులున్నాయని తెలిపాడు.

అదే సమయంలో మీ సిబ్బందికి చెందిన స్వీపర్ మా కాన్వర్‌జేషన్ విన్నాడు. అతనికి అర్థంగాకపోయినా ఏదో గూడుపుఠానీ జరుగుతుందని అర్థం చేసుకున్నాడు. అతన్ని బ్రతకనిస్తే మాకు ప్రమాదం. అందుకే అతన్ని చంపి డెక్‌మీద పడవేశారు. ఈ రకంగా మొదటి హత్యతో నాటకం ప్రారంభమయింది."

అతని చేతిలో సిగిరెట్ అయిపోయింది. దానిని క్రింద పడవేసి మరొకటి ముట్టించుకున్నాడు. రెండు దమ్ములు లాగి శ్రోతల వైపు చూసి నవ్వాడు.

"తరవాత ఈవిషయాన్ని మీరు అఫీషియల్స్‌కి తెలియ చేశారు. అక్కడ ఉన్న మా ఏజెంట్ల ప్రోద్బలంమీద తాము వెంటనే ఇద్దరు సి. ఐ. డి. అధికారులను పంపుతున్నట్లుగా మీకు తెలియచేసింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాము. విమానంలో వస్తున్న వారిని,

దోవలోనే వారి విమానాన్ని కూల్చివేసి, వారిస్థానంలో మేము బయలుదేరాము.

మా ఆదేశం పైన మీరు షిప్ వేగాన్ని తగ్గించారు. ఇందువల్ల మాకు లాభం. ఎందుకో తెలుసా? మన వెనకగా మా దేశానికి సంబంధించిన నౌక ఒకటి వస్తూంది.

మేము షిప్ మీద దిగిన తర్వాత మా ప్రయత్నాలు ఆరంభించాము. షిప్ సిబ్బందిలో ఉన్న మా వ్యక్తులు మాకు సాయం చేశారు. మహేందర్ స్టోరు రూమ్స్ గాలించడం ప్రారంభించాడు. నేను బయట పరిశోధనని సాగిస్తున్నట్లు నాటకం నడిపాను.

ఇందులో డ్రాబేక్ ఏమిటంటే మాలో ఎవ్వరికీ యురేనియం ఏయే పెట్టెలలో ఉన్నది తెలియదు.

యురేనియం ఉన్న బాక్స్‌ల పైన ఒక గుర్తు ఉంది. వాటికోసం వేట సాగించాడు మహేందర్.

ఆ సమయంలోనే పాసింజర్స్‌కి సంబంధించిన వ్యక్తి ఒకడు లోనికి వచ్చాడు. నిజానికతడు ఆ బాక్స్‌ల వెంట వర్తకులచే పంపబడ్డ ప్రతినిధి. బహుశా మా ప్రయత్నాన్ని కనిపెట్టి వచ్చాడో, ఏమో అతన్నికూడా హతం చేసి, రహస్యంగా సముద్రంలో పారేశాము.''

'మైగాడ్! ఇది జరిగినట్లు మాకు తెలియలేదే?' అన్న భావం శ్రోత లిద్దరి కళ్ళల్లో కన్పించింది.

"అవును. ఈ హత్య సంగతి ఎవరికీ తెలియదు. హతుడి స్నేహితుడు, అతనితో పాటు పంపబడ్డవాడు కూడా నోరెత్తలేదు. మాకు భయపడి ఉంటాడు.

సరే. తర్వాత వినండి! ఆ తర్వాత భారత ప్రభుత్వం నుంచి మీ కొక మెస్సేజ్ వచ్చింది. సి. ఐ. డి. లను

పంపుతున్న విమానం కూలిపోయిందని. కాని యిది ఊహించిన మేము మా అనుచరుల్ని కాపలాగా ఉంచాము రేడియో రూంకి. అతడే వైర్‌లెస్ ఆపరేటర్‌ని చంపి, మెస్సేజ్ కాయితాలు దొంగిలించి, చించేశాడు.

అయితే అతడొక పొరపాటు చేశాడు. దాని ఫలితం గానే మీకు మత్తుమందు కలిపిన పానీయం యిచ్చి, తాళాలు దొంగిలించి, వైర్‌లెస్ ట్రాన్స్‌మీటర్‌ని పగల కొట్టాల్సి వచ్చింది. అతడాపనిని అప్పుడేచేసి ఉంటే ఇంత శ్రమ ఉండేది కాదు.

అయితే హఠాత్తుగా మరో హత్య చేయాల్సి వచ్చింది. నిజానికి హత్య చేయటం మాకు యిష్టంలేదు. ఈ షిప్ కెప్టెన్ అయిన నిన్ను బెదిరించి, నౌకని కిడ్నాప్ చేయాలనుకున్నాము. అయితే తలవని తలంపుగా హత్యలు చేయక తప్పలేదు.

తన గదిలో కూర్చొని ట్రాన్సిస్టర్‌లో వార్తలు వింటున్న పాసింజర్స్‌కి హఠాత్తుగా మా మీద అనుమానం వొచ్చింది. విమానం కూలిపోయిన విషయం న్యూస్‌లో కూడా చెప్పారు. అతడు బయటికి పరుగెత్తాడు. అయితే అదృష్టవశాత్తు అటుగావస్తున్న మా అనుచరుల్ని చూసి, నీ సిబ్బంది వ్యక్తే అనుకొని, ఈ వార్త చెప్పాడు. అతను కూడా ఆఖరు.

మా దగ్గరగల రహస్య ట్రాన్స్‌మీటర్‌తో మాట్లాడాము. మా కోసం ఎదురు చూస్తున్న మా దేశపు నౌక వెంటనే బయలుదేరింది.

మనం యింకా కొద్ది సేపట్లో త్వరలో ప్రక్కనే ఉన్న ఒక ద్వీపాన్ని చేరుకుంటాం. మర్చిపోయాను. మనం

రూటు మారాము. ఇటుగా ఏ స్టీమరూ రాదు. అంచేత మీకు సహాయం వస్తుందన్న ఆశ వదలుకోండి. అక్కడ బాక్సులను మా షిప్‌లోకి ఎక్కించుకొని, మిమ్మల్ని వది లేసి, మా దారిన మేము వెళ్ళిపోతాము."

చెప్పటం ముగించి, లేచి నిలబడ్డాడు శంకర్‌సింగ్.

"మీ అనుమానాలన్నీ తీరినాయి అనుకుంటాను. మీరు మాట్లాడు కోవటానికి వీలుగా మీ నోటి కతికించిన టేప్‌లు మాత్రం తీసి వెళ్తాను. మీ కాబిన్ బయట మా అనుచరులున్నారని మరిచిపోకండి."

టేప్‌లు లాగేసి, బయటకు పోయాడు శంకర్‌సింగ్. అతని వెనకే తలుపులు మూసుకున్నాయి.

దీర్ఘంగా నిశ్వశించాడు కెప్టెన్ కోస్లా. ఆయన హృదయం కొంచెం తేలికపడింది. ఈ హత్యల వెనుక యింత కథ ఉన్నదన్న మాట అనుకున్నాడు.

"మైగాడ్! ఎంత ఘోరం!!" శంకర్‌సింగ్ వెళ్ళిన తరువాత అన్నాడు డాక్టర్ బెహెల్.

జరిగినది తలుచుకుంటుంటే కోస్లా మెదడు మొద్దుబారి పోతున్నట్లనిపించింది. ఈ షిప్ కెప్టెన్ అయిన తనకి తెలియకుండానే ఇంతకథ జరిగిందన్న బాధ ఆయనలో ద్యోతక మవుతూంది. అంతకంటె ముఖ్యంగా తన సిబ్బందిలోనే దేశద్రోహులున్నారని జ్ఞప్తికి వచ్చినపుడు ఆయన హృదయం బాధతో విలవిలలాడుతూంది.

తనకు తెలిసిన ఈ నిజాన్ని ప్రభుత్వానికి తెలపాలన్న ఆత్రత. కాని దారేది? నిస్సహాయంగా తనలో తాను గొణుక్కోవటం మినహా మరేమీ చేయలేకపోయాడు.

7

శంకర్ సింగ్ నేరుగా కంట్రోలు రూం లోనికి నడిచాడు. అతని అనుచరులు మిగిలిన సిబ్బందిని ఆశపెట్టో, భయపెట్టో లొంగ దీసుకున్నారు.

దూరంగా విశాలమయిన దీవి ఒకటి కనిపిస్తోంది. అక్కడ షిప్‌కి లంగరు వేయటానికి ఆర్డరు యిచ్చాడు శంకర్ సింగ్.

మహేందర్‌ని అక్కడ ఉంచి, తన కాబిన్‌లోకి నడిచాడు. పాకెట్ సైజ్ ట్రాన్స్‌మిటరు తీసి తమ నౌకకు డైరెక్షన్స్ యిచ్చాడు.

మరో అరగంట తర్వాత—అంటె మధ్యాహ్నం మూడున్నర నాలుగు గంటల ప్రాంతంలో దీవివద్ద లంగరు వేయబడినది.

శంకర్ సింగ్ ఆజ్ఞపై పాసింజర్స్‌ని దింపి, దీవిపై వరసగా నిలబెట్టారు. తెల్లముఖాలతో దీవిని చేరుకున్నారు వారు. కొందరు మాత్రం తమ నౌకను "కిడ్నాప్" చేశారని ఊహించారు.

అందరినీ నిలబెట్టిన తర్వాత శంకర్ సింగ్ వారిని చూస్తూ ఇలా అన్నాడు. "మీలో బాక్స్‌లకు చెందిన వ్యక్తులు ఎవరో బయటికి రండి. వాటిని మేము స్వాధీనం చేసుకోబోతున్నాం!"

ఎవరూ బయటికి రాలేదు. వస్తారని కూడా అనుకోలేదు, శంకర్ సింగ్. కొంతమంది పాసింజర్సు అతన్ని ఎదిరించారు. కాని అతడి చేతిలో రివాల్వరు వారిని బలికొనడంతో, మిగిలినవారు ధైర్యం చేయలేక పోయారు.

అందరి చేతులు వెనక్కి కట్టి, వాళ్ళ నోటికి టేప్స

అతిక్రించారు. వారితో బాటె కెప్టెన్ కోస్లాను, డాక్టరు బెహెల్ ను వరసలో ఉంచారు. వారికి కాపలాగా యిద్దరు అనుచరులనుంచి షిప్ లోకి వెళ్ళిపోయాడు శంకర్ సింగు.

సాయంకాలం అయిదుగంటల ప్రాంతంలో సమీపించింది వారి నౌక. అప్పటికి చీకటిపడి, మేఘాలు కొద్దిగా ముసురు కోవటం వల్ల ఆ షిప్ ఏ దేశానిదైనదీ, దాని గుర్తులవల్ల గ్రహించలేకపోయాడు కెప్టెన్. మౌనంగా చూస్తుండి పోయాడు.

అతని ప్రక్కన ఉన్న డాక్టరు బెహెల్ కి కోస్లాలోని అంతస్సంఘర్షణ తెలుసు. కాని అతను మాత్రం ఏం చేయగలడు? నిస్సహాయంగా ఉండిపోయాడు.

యూరేనియం బాక్సుల సంగతి ఎలాఉన్నా కెప్టెన్ కోస్లాని మరో విషయం పట్టి బాధిస్తోంది. తమని కిడ్నాప్ చేసిన దుర్మార్గులు తమని వదలరు. తాము తిరిగి నాగరిక ప్రపంచం చేరుకోకుండా చంపి, ఈ దీవి మీదే పాతేసినా పాతేస్తారు. షిప్ ని ఎలాగోలా పేల్చి వేస్తారు.

తాను తప్పించుకుంటే చాలు ఈ పాసింజర్సుని రక్షించగలడు. దీవిలోకి పారిపోతేనో? లాభంలేదు. వెంటపడతారు.

కెప్టెన్ కోస్లా అక్కడ తమకు కాపలా వున్నవారి వంక చూశాడు. చేతిలో రివాల్వర్సులో కాపలా కాస్తున్నారు. అందరి చేతులు కట్టివేయడం వల్ల, అంత ప్రమత్తతగాలేరు. తలతిప్పి షిప్స్ వైపు చూశాడు.

రెంటిని దగ్గరగాచేర్చి, రెండు డెక్ ల మీదకు వెడల్పాటి చెక్కవంతెన వేసినట్లున్నారు. రెండు షిప్ ల

లోని సిబ్బంది ఒక్కొక్క బాక్సునే జాగ్రత్తగా మోస్తూ వచ్చిన షిప్‌లోకి చేరుస్తున్నారు.

చటుక్కున ఒక ఆలోచన తట్టింది కోస్లాకి.

కాపలావాణ్ని ఒకణ్ని దగ్గరకు రమ్మనమన్నట్లు కళ్ళతో సైగ చేశాడు. అతడు దగ్గరికి రాగానే, టేప్ విప్పదీయమన్నట్లు సైగ చేశాడు. అతడు క్షణం తటపటాయించి, విప్పదీశాడు.

తనకు దాహంగా ఉందని, మంచినీరు కావాలని చెప్పాడు కోస్లా. కాపలా వాళ్ళిద్దరూ కూడ బలుక్కున్నారు. ఒకడు లైఫ్‌బోట్‌లో షిప్‌లవయిపు పోయాడు. మరొకడు దూరంగా ఉన్నాడు.

గబగబా తన ప్లాను, తన ప్రక్కనే ఉన్న బెహెల్‌కు నెమ్మదిగా చెప్పాడు కెప్టెన్. సముద్రపుతీరం, గాలి హోరులో అతడు మాట్లాడింది ఒక్క బెహెల్‌కే అర్థం అయింది.

అయిదు నిమిషాల తర్వాత రెండోవాడు నీళ్ళ జగ్‌తో వచ్చాడు. చేతులు విప్పమన్నట్లు సైగ చేశాడు కోస్లా. అతడు నవ్వి, నోరు తెరవమని చెప్పి, ఆ నోటిలో పోశాడు, ఆత్రంగా తాగాడు కోస్లా.

తరవాత బెహెల్ కూడా మంచినీళ్ళు కావాలన్నట్లు సైగ చేశాడు. అతడికీ ఆ విధంగానే దాహం తీర్చారు. మరి కొంతమంది కూడా తమ దాహం తీర్చుకున్నారు.

8

షిప్స్‌మధ్య బాక్సుల మార్పిడి యింకా పూర్తికాలేదు. బాగా చీకటి పడింది.

రెండు షిప్‌లలోను లైట్లు వెలిగించారు. వీలయినంత

త్వరగా పనిపూర్తి కావటానికి అంతా శ్రమపడుతున్నారు శంకర్‌సింగు, మహేందర్‌లు. ఇతర అధికారులు దగ్గర ఉండి చూస్తున్నారు.

బాగా చీకటి పడటంవల్ల దీవిమీద అందరిని గుంపుగా ఒకచోట పోగుచేసి, వారిమధ్య ఎండు కట్టెలతో చిన్న సెగడు వేశారు. దాని చుట్టూ కూర్చుని చలిని పోగొట్టు కోవడానికి ప్రయత్నిస్తున్నారు పాసింజర్సు.

వారికి కొద్ది దూరంలో మరో సెగడువద్ద కూర్చొని చలికాచుకుంటూ వీరిని కాపలా కాస్తున్నారు ఆ యిదరు.

ఇంతకుముందు నీరు తాగినపుడు కోస్లా, బెహాల్‌లు ఒక పని చేశారు, నోటిలో కొంత నీటిని మింగకుండా, ఆ సంగతి ఇతరులు గమనించకుండా జాగ్రత్తగా ఉంచు కున్నారు.

టేప్‌లను అతికించిన తర్వాత పెదాలను అటూయిటూ కదుపుతూ, నోటిలోని నీటిని మెల్లిగా ముందుకు ఊసి, టేపుని తడిచేస్తూ, విప్పదీసుకోవటానికి ప్రయత్నించ సాగారు.

కొంత సేపటికి తడివల్ల టేపు లూజయి ఊడిపోయింది. చీకటిలో ఎవరూ వీరిని గమనించటం లేదు కూడా!

బెహాల్ క్రింద వెల్లకిలా పడుకున్నాడు కొంతసేపు. ఆకాశంలో మేఘాలు అలుముకున్నాయి. వర్షంవచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.

కొంతసేపు తరవాత నోటిని కోస్లా చేతులవద్దకు తెచ్చాడు. నోటితో నైలాన్ తాడుని విప్పదీయటానికి ప్రయత్నించ సాగారు. దాదాపు పది నిముషాల ప్రయత్నం అనంతరం కొంచం లూజు అయింది. చకచకా విప్పే

శాడు. మరుక్షణమే బెహెల్ చేతులుకూడా ఫ్రీ అయ్యాయి.

చేతులు కొద్దిగా రుద్దించి, చుట్టూ చూశాడు కోస్లా.

దూరంగా ఉన్న షిప్స్‌లోని కాంతి లీలగా వీరిమీద పడుతోంది. ఆ మసక వెలుతురులో ఎవరయినా తప్పించుకు పోవాలన్నా కాపలావారి కంట పడుతుంది.

అయిదు నిమిషాలనంతరం కెప్టెన్ కోస్లా, బెహెల్ ఇద్దరూ కాపలావారి వద్దకు నడిచారు. వీరిని చూడగానే వారి చేతులలో రివాల్వర్లు మెరిశాయి. ఇద్దరి చేతులు క్విక్‌గా పనిచేశాయి. వారి రివాల్వరులున్న చేతుల్ని వెనక్కి విరిచి, వారి గొంతుచుట్టూ రెండో చేతిని పోనిచ్చారు.

మరుక్షణమే ఆ యిద్దరు తలలు వాల్చేశారు.

వారిని ప్రక్కకు ఈడ్చుకుపోయి వారి డ్రస్ తాము ధరించి, తాము ధరించిన బట్టలు వారికి తొడిగి తిరిగి వచ్చారు.

పాసింజర్స్ దగ్గరికి వెళ్ళి తామెవరో తెలియచేసి, ఏం చేయాలో లోగొంతులతో చెప్పారు. అదే సమయంలో షిప్ మీది ఫ్లష్‌లైటు వారివైపు తిరిగింది. లోడింగ్ పూర్తయిందన్నమాట.

9

శంకర్‌సింగ్ పాసింజర్స్‌ని అలా సముద్ర తీరంలో దింపి, నిలబెట్టటానికి గల కారణం, అతనికున్న ఒక చిన్న అనుమానం మాత్రమే.

యురేనియంని రవాణా చేస్తున్న వ్యక్తులు తమ ఏజెం

ట్లను యిద్దరిని పంపించారు ఆ షిప్ లోనే. వారివెంట వైర్ లెస్ ట్రాన్స్మిటర్స్ కూడా ఉండి ఉంటాయని శంకర్ సింగు భావన.

అందుకే షిప్ మీద దిగిన వెంటనే ఏదో నెపంతో ప్రతి పాసింజర్ కాబిన్ నీ చెక్ చేశాడు. ఎందుకంటే ఆ ఏజంట్లు ఎవరో అతనికీ తెలియదు. వైర్ లెస్ ట్రాన్స్ మీటర్లు దొరక్క పోయినా, అతని అనుమానం అలాగే ఉండి పోయింది.

అందుకే పాసింజర్స్ అందరినీ డైనింగు హాలులో ఉంచి, బంధింపచేశాడు ఒకరకంగా. దీనివల్ల అతనికీ పెద్ద నష్టం ఏమీ లేకపోయినా, యురేనియం కోసం షిప్ కిడ్నాప్ జరిగిందన్న విషయం వారి బాస్ లకు, ఇతరులకు తెలిసే అవకాశం ఉంది. ఆ అవకాశం లేకుండా చేయడానికే అందరినీ తీరంలో దించాడు.

అందువల్ల వ్యక్తులవద్ద ఒక వేళ ట్రాన్స్మిటర్ లున్నా కట్టెన్ కోస్లాగాని, మరి యితరుల దృష్టిలోగాని పడ కుండా మెస్సేజ్ పంపటం అసాధ్యం.

లోడింగు పూర్తికావటంతోనే తన ప్లాన్ నెరవేర్చ దలిచాడు. ఈ షిప్ ను, దానిలోని మనుషులను క్షేమంగా ఒదిలిపెట్టే ఆలోచన అతనికి ఎప్పుడూ లేదు. దీనిని అక్సి డెండల్ గా చూపించి, ఈ నౌకని పేల్చివేయాలి. అందు కోసం అతను వేరే ఆలోచన చేశాడు.

బాక్స్ ల మార్పిడి అనంతరం శక్తివంతమయిన పది టైం బాంబ్స్ ను ఇంజన్ రూం, రేడియో రూం, మరికొన్ని ముఖ్యమయిన ప్రదేశాలలో, ఇతరులకు అంత సులభంగా కంటపడనిచోట్ల అమర్పించాడు.

ఆ కార్యక్రమం పూర్తికాగానే పాసింజర్స్ ని ఎక్కించి

షిప్‌ను వదిలెయ్యాలి. కొంతదూరం పోయిన తర్వాత అన్నీ ఒక్కసారి పేలి, షిప్ ధ్వంసం అయిపోతుంది. ఎవ్వరూ బయటపడరు. ఈ విషయం వారు ఊహించినా, బాంబ్స్ అన్నింటినీ తీసివేయలేరు.

ఫ్లడ్ లైటు వారివైపు తిప్పి రమ్మనమన్నట్లు సైగ చేశాడు. లైఫ్ బోట్లలో దశలవారీగా బయలుదేరారు పాసింజర్స్, శంకర్‌సింగ్ అనుచరుల దుస్తులలో ఉన్న కెప్టెన్ కోస్లా, డాక్టర్ బెహెల్ వారికి ఎస్కార్టుగా ఉన్నారు.

పాసింజర్స్ అందరిని వారి వారి కాబిన్స్‌లోనికి పంపారు. కొంతమంది నడవలేక పోతుంటే అతని సిబ్బంది స్వయంగా దించి వచ్చింది.

తన ముందునుంచి పోతున్న బెహెల్, కోస్లాలని గుర్తు పట్టలేక పోయాడు శంకర్‌సింగ్. అంతేగాదు, అతనే గాకుండా, అతని సిబ్బందికూడా బెహెల్, కోస్లా దుస్తులలో ఉన్న తమ సహచరులను గూడా గుర్తించలేక పోయారు.

నోటికి టేప్ అతికించి ఉన్నందువల్ల గింజుకుంటూ, మోసం జరిగిందని తమ యజమానికి సంజ్ఞ చేయటానికి ప్రయత్నిస్తున్న యిద్దరు వ్యక్తుల్ని బెహెల్ కోస్లాలు స్వయంగా తీసుకుపోయి కెప్టెన్ కాబిన్‌లో తూలేశారు.

"బంధించినా వీళ్ళకింకా కోపం తగ్గలేదు!" నవ్వుకుంటున్నాడు శంకర్.

"ఇంకా పావుగంటలో మనం తిరిగి వెళ్ళిపోతాం. బాంబ్స్ అన్నీ ఎరేంజ్ చేశారా?" అని తన అనుచరులను ప్రశ్నించాడు. ఇంకా కొన్ని అమరుస్తున్నామని జవాబు వచ్చింది.

అప్పుడే బయటికి రాబోతున్న కోస్లా, బెహెల్‌ల

చెవులబడ్డాయి ఆ మాటలు. తక్షణమే ఇంజన్ రూంలోకి పరుగెత్తారు. సాధారణంగా అక్కడే ఏది జరిగినా!

ఇంకా యిద్దరు, ముగ్గురు ఉన్నారక్కడ.

"అయిపోయిందా?" అని ప్రశ్నించాడు కెప్టెన్ కోస్లా. అతన్ని మొండి ధైర్యం ఆవహించింది. తనగొంతు గుర్తు పడతారన్న భయంకూడా పోయింది.

అక్కడ ఉన్నవారు అయిపోయిందని చెప్పారు.

"సరే! అందరూ పదండి. మేము చెక్ చేసివస్తాం. అయిదు నిమిషాల్లో బయలుదేర బోతున్నాం. మన నౌక మీద రెడీగా ఉండాలి మీరు."

వారు అలాగే నన్నట్లు తలవూపి కదిలారు.

'తను ఊహించినట్లే తమని పేల్చి వేయటానికి కుటిల యత్నం చేశాడు శంకర్ సింగ్,' అనుకున్నాడు కెప్టెన్ కోస్లా.

అంతా పరికించి ఒక బాంబు తీసి చూశాడు.

అది పేలటానికి యింకా గంటంపావు ఉంది. గుండె గుభిల్లుమంది. అన్నింటికీ ఒకే టైం అరేంజ్ చేశారో, లేదో తెలియదు.

డాక్టర్ బెహెల్ కి గబగబ వివరించసాగాడు.

10

ఇంజన్ రూంలోనుండి బయపడి, కాబిన్స్ వయిపు నడిచారు కోస్లా, శ్రీరాజ్ బెహెల్ లు.

వీరినిచూసి బంధించబడిఉన్న పాసింజర్స్ భయపడ్డారు. వారికి తామెవరమో చెప్పి, వారిని బంధ విముక్తులు చేశారు. తమ డ్రస్సువిప్పి నైట్ గౌన్స్ ధరించారు.

వారికి తమవెంట తెచ్చిన బాంబుల్ని చూపి, అటువంటివి ఎక్కడ కనపడ్డా, వెంటనే సముద్రంలో దూరంగా

పారెయ్యామని చెప్పారు.

అయిదు నిమిషాల తర్వాత శత్రువుల నౌక కదిలింది. దాని డెక్ మీద నిలబడి చూస్తున్నాడు శంకర్ సింగు. క్రమంగా దూరం అవుతూందది.

ఇక్కడ పాసింజర్స్‌లో కోలాహలం అధికమయింది. మిగిలిన తన సిబ్బందితోను, మగ పాసింజర్లతోను టైం బాంబ్స్ కోసం అన్వేషణ సాగించాడు కెప్టెన్ కోస్లా. అదృష్టవశాత్తు పది టైం బాంబ్స్ బయటపడ్డాయి. అన్నింటినీ డిఫ్యూజ్ చేసి సముద్రంలోకి విసిరేశారు.

అయినా తృప్తి తీరక తన పాసింజర్స్ అందరిని లైఫ్ బోట్లమీద మరలా ద్వీపం మీదికి తీసుకు వొచ్చాడు కోస్లా.

అందరినీ దీవిమీద షిప్ కు దూరంగా నడిపించి, షిప్ పేలినా ప్రమాదం లేదనుకునే బండలమాటున తీసుకు పోయి షిప్ లోనుంచి వచ్చే శబ్దాంకోసం ఎదురు చూడ సాగాడు.

దాదాపు ఇరవై నిముషాలనంతరం అతను అనుకున్న శబ్దాలు విన్పించాయి. కాని వారున్న స్టీమర్ లోకాదు. శత్రువుల నౌకనుంచి.

తలలువంచి కూర్చున్నవారు ఒక్కసారిగా తలెత్తి చూశారు. దూరంగా పెద్ద విస్ఫోటంతో, పేలి, మంటలు నింగిని తాకుతున్న శత్రు నౌక కన్పించింది.

అంతా దాదాపు అరగంటవరకు అలానే ఉండి పోయారు.

తరువాత మరో అరగంటకి కెప్టెన్ కోస్లా, అతని సిబ్బంది వెళ్ళి నౌకని పరిశీలించారు. అదృష్టవశాత్తు తమ నౌకలో ఏ లోపమూ లేదు. తిరిగి తమ ప్రయాణానికి ఏర్పాట్లు చేయసాగారు.

అయితే శత్రువుల నౌక ఎందుకు పేలిందో అతనికి తెలియలేదు.

దానిలోని రహస్యం తెల్సింది యిద్దరికే, అయితే ఆ యిద్దరులో ఒకరు స్టోరూంలో మరణించారు.

యురేనియం ఖనిజంఉన్న బాక్సులలో వీటితోపాటుగా ప్రతి బాక్సులోను అడుగున టైం బాంబ్సు ఉంచి రవాణా చేశారు.

ఒకవేళ తమగుట్టు బయటపడితే వీటితాలూకు అవశేషాలుకూడా దక్కరాదని వారి ఆశయం. ఆ సంగతి ఆ ఏజంట్లు యిద్దరికే తెలుసు.

టైం బాంబ్సు ఎప్పుడు పేలతాయో అన్న సంగతి వారికి వివరంగా వ్రాసి కోడ్ లో యివ్వబడింది. దానిని అనుసరించి బాంబ్ పేలే సమయం సమీపించినపుడల్లా, స్టోర్ రూంలోని దొంగతనంగా ప్రవేసించి, అడుగు చెక్కను విప్పదీసి, బాంబ్ను డిఫ్యూజ్ చేసేవారు.

ఆ సందర్భంలోనే బాంబ్ను డిఫ్యూజ్ చేసి వస్తున్న ఏజంటుని శంకర్ సింగ్ చూతా కనుగొని, మట్టుపెట్టటం జరిగింది. రెండోవాడు నోరు విప్పలేదు.

విప్పితే కథంతా బయటపడుతుంది. అందుకే మౌనంగా ఉండిపోయాడు.

ఇప్పుడా బాంబులను డిఫ్యూజ్ చేయక పోవటంవల్ల పేలింది. దానితో ఇతర ఎక్స్ప్లోజివ్స్ కూడా అంటుకొని, శంకర్ సింగు నౌక పేలిపోయింది.

మరో గంటతర్వాత 'స్టేట్ ఆఫ్ హర్యానా' సింగపూర్ వైపు బయలుదేరింది.

—: ఐపోయింది :—